
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 169 | మే 30, 2025 | వెల : రూ.3-00



## ఆగని గర్భవిచ్ఛిత్తి

# దందా!?



- దొడ్డిదారిన జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అక్రమాలు
- ఒక రోజుకు రూ.50 వేలు.. ఇష్టానుసారంగా గర్భవిచ్ఛిత్తి చర్యలు!

**వేద న్యూస్, జమ్మికుంట :**

గర్భంలోనే ప్రాణాలు ఛిద్రమైపోతున్నాయి. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న కొందరి తీరు కాసుల కోసమే అన్నట్లుగా ఉంటోంది. నిబంధనలకు తిలోదకాలిచ్చి వారు ఇష్టానుసారంగా గర్భవిచ్ఛిత్తి చర్యలకు పాల్పడుతున్నారు.

"పీసీ,పీఎన్ డీ యాక్ట్(PC&PNDT చట్టం)1994 ప్రకారం..

స్కానింగ్ ద్వారా గర్భంలో ఉన్న బిడ్డ ఆడ, మగ అని అడగడం, ప్రోత్సహించడం, చెప్పడం నిషేధం.."

"లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, అడిగినా, ప్రోత్సహించినా 3 సం.ల జైలు శిక్షతో పాటు రూ.10,000 నుంచి 50,000 వరకు జరిమానా విధించబడును"... ఈ చట్టాల గురించి బహిరంగంగా బోర్డులు, అన్ని ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రి నోటీసు బోర్డులలో డిస్ ప్లే చేస్తారు. కాగా, ఈ యాక్ట్ ల గురించి తెలిసినా కొందరు.. వైద్యులు పట్టించుకోకుండా..కాసుల కోసం కక్కుర్తి పడుతున్నారు..

ఆకస్మిక తనిఖీలు ఎప్పుడు?

కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట పట్టణంలో పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గర్భవిచ్ఛిత్తి చర్యలకు పాల్పడుతున్నట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఇందుకు ఒక రోజుకు రూ.50 వేలు తీసుకుంటున్నట్టు సమాచారం. గతంలో సదరు హాస్పిటల్ పై కేసులు నమోదయి.. సీజ్ అయినా తీరు మారలేదు. రీ ఓపెన్ అయిన నాటి నుంచి మళ్లీ పాత పంథాలోనే భ్రూణహత్యల దందా రహస్యంగా కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. కాగా, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు, పర్యవేక్షణలు చేపడుతూ.. భ్రూణహత్యలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు. స్కానింగ్ సెంటర్లలో 'నంబర్ కోడింగ్' ద్వారా పుట్టబోయే బిడ్డా.. ఆడా మగా అనే విషయాన్ని రహస్యంగా వెల్లడిస్తుండటంతో..ఆడ బిడ్డ అని తెలియగానే కొందరు గర్భ విచ్ఛిత్తికి ప్రయత్నిస్తున్నారు. ఈ విషయమై వైద్యారోగ్య శాఖ ప్రత్యేక శ్రద్ధ వహించాలని పలువురు కోరుతున్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులు

# బుట్టదాఖలు

- అధికారులకు కనీస పట్టింపు లేదు
- బీఆర్ఎస్ శేరిలింగంపల్లి ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి

**వేద న్యూస్, శేరిలింగంపల్లి:**


ప్రజావాణి ఫిర్యాదు లను అధికారులు బుట్ట దాఖలు చేస్తున్నారని బీఆర్ ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మిద్దెల మల్లారెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 26న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జోనల్ కమిషనర్ ఆఫీస్‌లో మంజీరా రోడ్డు దుస్థితి గురించి ఫిర్యాదు చేశానని చెప్పారు. కాగా, జోనల్ అధికారులు కానీ ఇంజనీరింగ్ అధికారులు కానీ ఇంతవరకు వచ్చి కనీసం రోడ్డును పరిశీలించలేదని వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వంలో అధికారుల పనితీరు ఇలా ఉందని, కావున వెంటనే జోనల్ కమిషనర్ స్వయంగా పరిశీలించి.. ఇట్టి రోడ్డు విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వచ్చే వారం రోజులలో స్కూలులు కూడా స్టార్ట్ అయితాయని, కావున ఈ లోపు రోడ్డును పునరుద్ధరించాలని అభ్యర్థించారు.

## అందినకాడికి దోచుకుంటున్న

# మీ సేవ నిర్వాహకులు

- రేషన్ కార్డుల మార్పుల చేర్పుల కోసం రూ.150 వసూలు..!
- చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న సంబంధింత అధికారులు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**




నల్లగొండ జిల్లాలో మీసేవ నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రేషన్ కార్డులో మార్పులు చేర్పులు కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయం వంటి ముందుగా మీ సేవ కేంద్రంలో దరఖాస్తులను సమర్పించాలి. అయితే ప్రజల అవసరాలను బట్టి జిల్లాలో మీసేవ నిర్వాహకులు అందిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఏ సంక్షేమ పథకం దరఖాస్తు చేసుకోవాలన్న ముందుగా మీసేవ కేంద్రాన్ని ఆశ్రయించవలసి వస్తుంది. ఇదే అదనుగా చేసుకొని జిల్లాలో మీసేవ నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అధిక వసూలకు పాల్పడుతున్నారు. మీసేవ దందా జిల్లాలో మూడు పూవులు ఆరుకాయలుగా వర్ధిల్లుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని ప్రధాన పట్టణాలలో ఈ దందా జోరుగా సాగుతోంది. మీసేవ నిర్వాహకులు రేషన్ కార్డులు మార్పులు,చేర్పులు ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రం ప్రభుత్వ నిబంధనలో 45 రూపాయలు వసూలు చేయాలి. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా 150 అంతకంటే ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. ప్రజలకు గత్యంతరం లేక, కార్డు కావాలనే ఆశతో ఎంతైనా భరిస్తూ దరఖాస్తు చేస్తున్నారు. బర్త్ డే సర్టిఫికెట్ల, ఓటర్ కార్డ్ దరఖాస్తులు కోసం ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకంటే భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారంగా తెలుస్తుంది. ఉన్నతాధికారుల నియంత్రణ లేకపోవడంతో ఇష్టమొచ్చినట్లు వసూలు చేస్తున్నారు. కనీసం ఆరు నెలలకోసారైనా అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ఇకనైనా తరచూ తనిఖీలు చేసి సామాన్యులకు అందే ప్రభుత్వ సేవలను పటిష్టవంతంగా అమలు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



## పశువులను అక్రమ రవాణా చేస్తే

# కఠిన చర్యలు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

రానున్న బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లాలో ప్రత్యేక చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ పేర్కొన్నారు. గురువారం మడుగులపల్లి చెక్ పోస్ట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణా నివారణకు అప్రమత్తంగా ఉండాలనీ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో అప్రమత్తంగా ఉంటూ ప్రతి వెహికల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. జిల్లాలో చెక్ పోస్టుల వద్ద 24 గంటలూ పోలీసు సిబ్బంది పర్యవేక్షిస్తూ, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలన్నారు. ఎవరైనా

మిగతా 4వ పేజీలో..



## బీసీలకు రిజర్వేషన్ల అమలు తర్వాతే

## స్థానిక సంస్థల ఎన్నికలు

# నిర్వహించాలి

**వేద న్యూస్, వరంగల్ జిల్లా:**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తున్నందున వెంటనే స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచేందుకు చర్యలు చేపట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూన్ చివరన లేదా జూలై మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉన్నట్టు, ముందుగా ఎంపీటీసీ జెడ్పీటీసీ ఆ తర్వాత సర్పంచ్ అనంతరం మున్సిపాలిటీ ఎన్నికలు ఆగస్టు 15 లోపు పూర్తి చేసే విధంగా జరిపేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉభయ సభలలో బీసీ రిజర్వేషన్ బిల్లులు ఆమోదించి కేంద్రానికి పంపిస్తేనే సరిపోయిందా..? బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలయ్యేలా అందుకు అనుగుణంగా యుద్ధ ప్రాతిపదిక తగిన చర్యలు

మిగతా 4వ పేజీలో..





## నకిలీ విత్తనాలు, ఎరువులు అరికట్టేందుకు

# కఠిన చర్యలు చేపట్టాలి

- దేశ వ్యాప్తంగా ధాన్యం సేకరణలో మొదటి స్థానంలో తెలంగాణ రాష్ట్రం
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**వేద న్యూస్, హన్మకొండ :**

నకిలీ విత్తనాలు, ఎరువులు అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, ఎస్పీలను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తో కలసి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఉమ్మడి వరంగల్ జిల్లా లో ధాన్యం సేకరణ, వ్యవసాయం, వర్షాకాల ముందస్తు ప్రణాళిక, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ, వ్యవసాయం, వర్షాకాలం ముందస్తు ప్రణాళిక, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి సంబంధించిన అంశాలపై సంబంధిత జిల్లాల కలెక్టర్లు, అధికారులు వివరణ ఇచ్చారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు సమన్వయంతో అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులను ఉక్కుపాదంతో అరికట్టాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా విక్రయించకుండా నకిలీ ఎరువులు, విత్తనాలను అరికట్టేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఎక్కడైనా

మిగతా 4వ పేజీలో..



# రేషన్ డీలర్లూ.. నమ్మకాన్ని నిలబెట్టండి: మంత్రి నాదెండ్ల

**- జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ - దివ్యాంగులు, వృద్ధులకు వారి ఇంటివద్దే రేషన్ అందజేత**

**వేద న్యూస్, విజయవాడ :**

రాష్ట్రంలో జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీని తిరిగి ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసిందని, రేషన్ డీలర్లు ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెట్టి, కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరుకులు పంపిణీ చేయాలని ఆయన కోరారు. జూన్ 1న పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న సన్నాహాలను పరిశీలించేందుకు మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం విజయవాడలో పర్యటించారు. మధురానగర్‌లోని 218వ నంబర్ రేషన్ దుకాణంలో నిర్వహించిన ట్రయల్ రన్‌ను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పౌరసరఫరాల శాఖ ఏర్పాటు చేసిన చౌకధరల దుకాణాల ఈ-పాస్, వెయింగ్ మెషీన్ల సేవా శిబిరాన్ని పౌరసరఫరాల కమిషనర్ సౌరభ్ గౌర్‌తో కలిసి మంత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ రేషన్ డీలర్లతో మంత్రి మనోహర్ మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అందుకే రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని మళ్లీ చేపడుతున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు వారి ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. "గతంలో రేషన్ డీలర్లు కార్డుదారుల కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉండి సేవలు అందించారు. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో, మనసుపెట్టి పనిచేసి కార్డుదారులకు గౌరవంగా సేవలు అందించాలి," అని మంత్రి సూచించారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు, ఆదివారాల్లో కూడా రేషన్ దుకాణాలు తెరిచి ఉంచి సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఐదో తేదీలోపే దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇంటివద్దకే సరుకులు చేరేలా డీలర్లు చొరవ చూపాలని కోరారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందించడం ద్వారా కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడవచ్చన్నారు. ఒకవేళ సాంకేతిక సమస్యలు తలెత్తినా, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరుకుల పంపిణీ ఆగకుండా చూడాల్సిన బాధ్యత డీలర్లపై ఉందని



ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా రేషన్ డీలర్లు పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. రేషన్ దుకాణాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, సరైన తూకంతో సరుకులు పంపిణీ చేయాలని, ధరలు, స్టాక్ వివరాల బోర్డులను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. ఈ-పాస్, వెయింగ్ మెషీన్ల మరమ్మతుల కోసం ఏర్పాటు చేస్తున్న సర్వీస్ క్యాంపులను సద్వినియోగం చేసుకుని, సరుకుల పంపిణీకి సర్వసన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు.

## భారత్ ఊహించని దెబ్బ కొట్టింది

**వేద న్యూస్, డెస్క్:**



భారత్, పాకిస్థాన్‌ల మధ్య జరిగిన యుద్ధంలో ఇండియన్ ఆర్మీ ధైర్య సాహసాలు, తిరుగులేని వ్యూహాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇండియన్ ఆర్మీ మిస్సైల్స్ దాడులపై తాజాగా పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తమను ఊహించని దెబ్బ కొట్టిందని అన్నారు. మే 10వ తేదీన భారత్‌పై తమ ఆర్మీ దాడి చేయడానికి అంతా సిద్ధం చేసుకుందని, ఈలోపే భారత్ బ్రహ్మోస్ మిస్సైల్స్‌తో దాడి చేసిందని తెలిపారు. కీలక మిలటరీ బేస్‌లతోపాటు ఎయిర్‌పోర్టుపై దాడి చేసిందన్నారు. పాకిస్థాన్ మిత్ర దేశం అజర్‌బైజాన్‌లో పర్యటిస్తున్న షహబాజ్ షరీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అజర్‌బైజాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో షరీఫ్ మాట్లాడుతూ.. ' మే 10వ తేదీన ఇండియాపై దాడులు చేయడానికి ప్లాన్ చేశాం. పాకిస్థాన్ ఆర్మీ దాడులు చేయడానికి అంతా సిద్ధం చేసుకుంది. ప్రార్థనలు పూర్తయిన తర్వాత .. తెల్లవారుజామున 4.30 గంటలకు దాడి చేద్దామని అనుకున్నాం. పాకిస్థాన్ దాడి చేయడానికి ముందే ఇండియా దాడులు మొదలుపెట్టింది. పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో లాంగ్ రేంజ్ సూపర్ సోనిక్ బ్రహ్మోస్ క్రూయిస్ మిస్సైల్స్‌తో దాడులు చేసింది. రావల్పిండిలోని ఎయిర్‌పోర్టుపైనా దాడి చేసింది' అని అన్నారు.

# నాలాంటివారు ఇకపై రారు: ఇళయరాజా

**- నా గురించి నేనే చెప్పుకోవాలి - నాకంటే ముందు నాలాంటి వారు రాలేదు**



వేద న్యూస్, డెస్క్ : సినిమా పాట గురించి తెలిసినవారికి ఇళయరాజా పేరు తెలియకుండా ఉండదు. స్వరాల మాంత్రికుడిగా ఆయనకి పేరు ఉంది. పోస్టర్ పై ఉన్న ఆయన పేరే ప్రేక్షకులను సినిమాలకు రప్పించిన రోజులున్నాయి. ఆయన పాటల కారణంగానే విజయవంతమైన సినిమాలు ఉన్నాయి. ఆయన అందించిన పాటల కారణంగా పాప్యులర్ అయిన హీరోలున్నారు. ఆయన అంతటి వేగంగా బాణీలు కట్టే సంగీత దర్శకులు బహుకొద్ది మంది అనే చెప్పాలి. అలాంటి ఇళయరాజా తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ .. " పాండిత్యం ఉన్నవారు తమ గురించి తామే చెప్పుకోవాలి. లేకపోతే ఎవరికీ తెలియదు. అలా నా గురించి నేను మాత్రమే చెప్పుకోవాలి. నా విషయానికి వస్తే, లోకంలో నాలాంటివారు లేరు .. ఇకపై నాలాంటివారు వస్తారా అంటే రారు అనే చెబుతాను. నాకంటే ముందు నాలాంటివారు ఎవరైనా ఉన్నారా అంటే లేరనే చెబుతాను" అని అన్నారు. "సినిమా సంగీతానికి సంబంధించి చాలా గొప్పవారు ఉన్నారు. అయితే వాళ్లంతా కూడా ఎవరో ఒకరిని గురువుగా భావించి .. వారి దగ్గర నేర్చుకున్నారు. బాగా అనుభవం గడించిన తరువాత వాళ్లు సంగీతం చేయడం మొదలుపెట్టారు. కానీ నేను అలా కాదు .. ఎవరి దగ్గరా నేర్చుకోలేదు. ఒక కుగ్రామంలో పుట్టిపెరిగాను. అక్కడ సంగీతం నేర్చుకునే అవకాశమే లేదు. అలాంటి పరిస్థితి నుంచి ఈ స్థాయికి నేను రావడానికి కారణం ఆ దేవుడే. ఇది ఆయన ఇచ్చిన వరంగానే నేను భావిస్తూ ఉంటాను" అని అన్నారు.

# ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట

**తాత్కాలిక ముందస్తు బెయిల్ మంజూరు చేసిన ధర్మాసనం**

**వేద న్యూస్, డెస్క్:**





తెలంగాణలో తీవ్ర సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి, రాష్ట్ర ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి. ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో ఈరోజు స్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న ఆయన దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, ఆయనకు తాత్కాలికంగా ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మూడు రోజుల్లోగా ప్రభాకర్ రావు భారతదేశానికి తిరిగి రావాలని, ఇక్కడికి వచ్చిన తర్వాత దర్యాప్తునకు సంపూర్ణంగా సహకరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా, ప్రభాకర్ రావు భారత్ తిరిగి వచ్చేందుకు వీలుగా ఆయన పాస్‌పోర్ట్‌ను కూడా మంజూరు చేయాలని ఆదేశించింది. ప్రస్తుతం ఆయనపై ఎలాంటి కఠినమైన చర్యలు చేపట్టవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. మూడు రోజుల్లో ఇండియాకు రావాలని ప్రభాకర్ రావును ఆదేశించింది.

# పీవోకేపై రాజ్‌నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతున్నాయి. అయితే కాల్పుల విరమణకు ఒప్పుకున్న ఇండియా.. శత్రుదేశాన్ని మాత్రం వదలడం లేదు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్ నిజస్వరూపాన్ని ప్రపంచ దేశాల ముందు బయటపెడుతోంది. అఖిలపక్ష ఎంపీల బృందాన్ని విదేశాలకు పంపించిన మోదీ సర్కారు.. పాక్ కుట్రలు, కుతంత్రాలను బట్టబయలు చేస్తోంది. అన్ని వైపుల నుంచి శత్రుదేశాన్ని అష్టదిగ్బంధం చేసేందుకు ప్రయత్నిస్తోంది. మూడు చెరువుల నీళ్లు తాగిస్తూ.. మనతో పెట్టుకోవాలంటే వణికేలా చేస్తోంది. ఈ తరుణంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ మనదేనని ఆయన అన్నారు. అక్కడి ప్రజలు భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అతి త్వరలో పీవోకేను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజలు మన కుటుంబసభ్యులన్ని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. భౌగోళికంగా వేరు పడినా వారు ఎప్పటికైనా ఇండియాలో కలుస్తారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ చాలా బలంగా ఉందన్నారు. పీవోకేలోని చాలా మంది ప్రజలు ఇండియాలో కలవాలని కోరుకుంటున్నారని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. కొంతమంది మాత్రమే దీనిని వ్యతిరేకిస్తున్నారని ఆయన వివరించారు. పీవోకే ప్రజలు ఏదో ఒక రోజు భారత్‌లో ఏకమవుతారని.. ఆ రోజు ఎంతో దూరంలో లేదన్నారు. పీవోకే దానంతట అదే వస్తుందని.. అక్కడున్న వారికి ఇండియాతో దృఢమైన బంధాలు ఉన్నాయని రక్షణ మంత్రి పేర్కొన్నారు. పీవోకేలోని మెజారిటీ ప్రజలు భారత్‌లో కలవాలని కోరుకుంటున్నారని.. కొందరు మాత్రమే తప్పుదారి పట్టారని చెప్పుకొచ్చారు. మనం ఏదైనా చేయగలమని.. అయితే శక్తితో పాటు సంయమనం కూడా చాలా అవసరమని స్పష్టం చేశారు రాజ్‌నాథ్. మేకిన్ ఇండియా ఆవశ్యకత ఏంటో ఆపరేషన్ సిందూర్‌తో అందరూ గ్రహించారని వ్యాఖ్యానించారు. ఫైటర్ జెట్లు, మిసైల్ సిస్టమ్స్ నిర్మించడంతోపాటు అధునాతన యుద్ధ సాంకేతికతలను అభివృద్ధి చేయడం మీద దృష్టిపెట్టామని రాజ్‌నాథ్ సింగ్ చెప్పుకొచ్చారు.

# పాక్‌తో యుద్ధం వేళ ఆ చిన్నారికి సైన్యం సెల్యూట్



**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

పెహల్గామ్ ఉగ్ర ఘటనకు బదులుగా పాకిస్థాన్‌లోని ఉగ్ర, సైనిక స్థావరాలే లక్ష్యంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ పైచేయి సాధించింది. పాకిస్తాన్‌కు చావు దెబ్బ తగిలింది. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు, సైన్యం, సైనిక విమానాలు, ఫైటర్ జెట్లు సహా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లు ధ్వంసం అయినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సింధూర్‌లో కీలకపాత్ర పోషించింది మన సరిహద్దు భద్రతాదళం. సైన్యంతో పాటు బీఎస్ఎఫ్ వీరోచిత పోరాటంతో పాక్ రేంజర్లు కాలికి బుద్ధిచెప్పారు. మొత్తం 70 పాకిస్తాన్ బోర్డర్ ఔట్‌పోస్టులతో పాటు, 42 ఫార్వర్డ్ లొకేషన్లను ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో పాక్ రేంజర్లు గాయపడ్డారు. కొందరు ప్రాణాలు కోల్పోయారు. సుందర్బని సెక్టార్ ఎదురుగా ఉన్న లాంచ్‌ప్యాడ్‌ని నామరూపాల్లేకుండా చేసింది. బీఎస్ఎఫ్ పోరాటంలో మహిళా జవాన్లు కూడా భాగస్వాములయ్యారు. ఈ క్రమంలో ఓ పదేళ్ల బాలుడు సైన్యం దృష్టిని ఆకర్షించాడు. యుద్ధంలో పాక్ దాడులను మన సైన్యం దీటుగా తిప్పికొడుతున్న వేళ.. భారత సైన్యానికి ఓ పదేళ్ల బాలుడు సపోర్ట్‌గా నిలిచాడు. సైనికులకు మంచినీరు, పాలు, టీ, లస్సీ.. వంటివి అందిస్తూ ఆపరేషన్‌లో తాను సైతం ఉన్నానని చాటుకున్నాడు. బాలుడి సేవలను గుర్తించిన స్థానిక సైనికాధికారులు ఇటీవల ఆ బాలుడిని సత్కరించారు. అంతర్జాతీయ సరిహద్దుకు 2 కి.మీ దూరంలో పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లా తారావాలీ గ్రామం ఉంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో అక్కడ భారీ సంఖ్యలో బలగాలను మోహరించారు. శత్రు దేశంతో భారత సైన్యం తలపడుతున్న వేళ.. అదే గ్రామానికి చెందిన శ్రవణ్ సింగ్ అనే పదేళ్ల కుర్రాడు సైనికులకు తోడుగా నిలిచాడు. వాళ్లు అడగకముందే.. వారికి మంచినీరు, ఐస్, చాయ్, పాలతోపాటు లస్సీ ఇతర ఆహార పదార్థాలను అందించే పనిని భుజానికెత్తుకున్నాడు. ఇది గమనించిన స్థానిక విభాగం కమాండింగ్ ఆఫీసర్ మేజర్ జనరల్ రంజిత్ సింగ్ మన్రాల్.. ఆ బాలుడిని ప్రశంసలతో ముంచెత్తారు. తమ కుమారుడిని చూస్తుంటే గర్వంగా ఉందని, సైనికులు కూడా తమ బిడ్డను ఇష్టపడుతుండటం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని శ్రవణ్ తండ్రి అన్నారు. నాలుగో తరగతి చదువుతున్న అతడికి ఆ పనులు చేయాలని ఎవ్వరూ చెప్పలేదని, సొంతగా అతడే చేశాడని చెప్పారు. పెద్దయ్యాక తానూ సైనికుడిని అవుతా. దేశానికి సేవ చేయాలని అనుకుంటున్నా అని శ్రవణ్ సింగ్ తెలపడం విశేషం.

# ఆ విద్యార్థులే లక్ష్యంగా స్టూడెంట్ వీసాలపై అమెరికా కీలక నిర్ణయం, చైనా స్పందన

**వేద న్యూస్, డెస్క్:**

విదేశీ విద్యార్థుల విషయంలో అమెరికా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా స్టూడెంట్ వీసాల కోసం దరఖాస్తు చేసుకునే వారి ఇంటర్వ్యూ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసింది. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయంపై చైనా స్పందించింది. తమ దేశ విద్యార్థుల ప్రయోజనాల గురించి ఆందోళన వ్యక్తం చేసింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావోనింగ్ మాట్లాడుతూ "అంతర్జాతీయ విద్యార్థులతో పాటు చైనా విద్యార్థుల చట్టబద్ధమైన హక్కులు, వారి ప్రయోజనాలను కాపాడాలని అమెరికాను కోరుతున్నాం" అని అన్నారు. ఇరు దేశాల మధ్య విద్యా సంబంధిత వ్యవహారాల్లో ఎటువంటి ఆటంకాలు ఉండకూడదని అభిప్రాయపడ్డారు. పరిశోధనా రంగాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న చైనా విద్యార్థులతో పాటు, చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీతో సంబంధాలున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థుల వీసాలను రద్దు చేయడానికి అమెరికా ప్రభుత్వం సిద్ధమవుతోందని యూఎస్ సెనేటర్ మార్కో రూబియో ఇటీవల ప్రకటన చేశారు. ఈ ప్రకటన వెలువడిన నేపథ్యంలో చైనా ఈ విధంగా స్పందించింది. ప్రస్తుతం అమెరికాలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థుల్లో భారత్ తర్వాత చైనా విద్యార్థులే అధిక సంఖ్యలో ఉన్నారు.

**- సోషల్ మీడియా ఖాతాలపై నిఘా**

విదేశీ విద్యార్థుల వీసా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో భాగంగా వారి సామాజిక మాధ్యమాల ఖాతాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడంపై అమెరికా దృష్టి సారించింది. దీని కోసం "సోషల్ మీడియా వెట్టింగ్" అనే విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇందులో భాగంగా వీసా కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ఆన్‌లైన్ కార్యకలాపాలను అధికారులు పరిశీలిస్తారు. వారి సోషల్ మీడియా ప్రొఫైళ్లను పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే వీసా మంజూరు చేయాలా వద్దా అనే నిర్ణయం తీసుకుంటారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు కొత్త విద్యార్థులకు వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లు ఇవ్వడాన్ని నిలిపివేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో ఈ తాత్కాలిక నిలిపివేత అమల్లోకి వచ్చింది.

# సంపాదకీయం

## నేతల మాటలు.. రగిలిన మంటలు

బాధ్యతాయుతమైన వ్యక్తులు మాట్లాడే మాటలు, వ్యవహార శైలి సమాజంలో సామాన్య ప్రజానీకానికి ఆదర్శంగా ఉండాలి. రాజ్యాంగబద్ధమైన పదవులలో ఉన్న ఎంఎల్ఎలు, ఎంపిలు, మంత్రులు జాతి గౌరవాన్ని, దేశ సమగ్రతను పెంపొందించే విధం గా మాట్లాడాలి. దురదృష్టవశాత్తు నేడు దేశంలో ప్రజాప్రతినిధులు మాట్లాడే భాష రోజుకురోజుకూ దిగజారిపోతోంది. జాతి ఐక్యతకు పాటుపడుతామని ప్రమాణం చేసిన వారే జాతి సమగ్రతకు హాని కలిగించేలా మాట్లాడుతున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని సైనికుల త్యాగాలను, సామర్థ్యాన్ని కీర్తిస్తూ వారికి అండగా ఉండాల్సిన రాజకీయ నాయకత్వం సైనికులను అవమానకరపు మాటలతో వేధిస్తోంది. కులాలను, మతాలను సైన్యానికి ఆపాదిస్తూ దిగజారుడు మాటలతో దేశపరువును మంటగలుపుతున్నారు. వారానికో ఎపిసోడ్ మాదిరిగా ప్రజా ప్రతినిధులు చేస్తోన్న అడ్డగోలు, రోత వ్యాఖ్యలతో ప్రజలు దిగ్భ్రాంతికి లోనవుతున్నారు. సైన్యాధికారిణి కల్నల్ సోఫియా ఖురేషిపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా నిసిగ్గుగా చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా దేశప్రతిష్టను దిగజార్చాయి. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి మీడియాకు వివరాలు అందించిన కల్నల్ సోఫియా ఖురేషికి మతాన్ని ఆపాదిస్తూ ఉగ్రవాదుల సోదరిగా వర్ణించి దేశగౌరవానికి తలవంపులు తెచ్చాడు. మంత్రి విద్వేషపు మాటలపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు ప్రవర్తించింది. చివరకు ఆ రాష్ట్ర హైకోర్టు మంత్రి వ్యాఖ్యలను సుమోటాగా తీసుకుని కేసు పెట్టమని ఆజ్ఞాపించటంతో అతని నోటిదూల తీవ్రత తెలుస్తోంది. హైకోర్టు కేసు నుంచి విముక్తి కోసం విజయ్ షా సుప్రీం కోర్టు మెట్లెక్కితే క్షమాపణలు చెప్పమని ఆజ్ఞాపించింది.

విజయ్ షా క్షమాపణ చెప్పిన విధానాన్ని కూడా సుప్రీం కోర్టు ఆక్షేపించింది. మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పడానికి అభ్యంతరం ఏంటని నిలదీసింది. ముగ్గురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయమని మధ్యప్రదేశ్ డిజిపిని ఆదేశించడంతో సిట్ ఏర్పాటు కాబడి మంత్రి వ్యాఖ్యలపై దర్యాప్తు చేస్తోంది. మంత్రి నోటి దురుసుతనంపై దేశంలోని వివిధ వర్గాల ప్రజలు, మేధావులు నిరసనను వ్యక్తం చేసినప్పటికీ మధ్యప్రదేశ్ ప్రభుత్వం అతనిని మంత్రివర్గం నుంచి తప్పించే ప్రయత్నం చేయలేదు. సుప్రీం కోర్టు ఈ వ్యవహారంలో పలు దఫాలుగా విజయ్ షా వ్యాఖ్యలపై అసహనాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేసినప్పటికీ భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం అతనిపై ఏ చర్యా తీసుకోకపోవడం దేశప్రజలను కలవరపెడుతోంది. ఉత్తరప్రదేశ్ సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు మాజీ ఎంపి రామ్ గోపాల్ యాదవ్ బిజెపి నాయకులకు తానేమి తక్కువ కాదన్నట్లు అవాకులు, చవాకులు పేలాడు. సైనికాధికారులకు కులం, మతం అంటగడుతూ విద్వేషాన్ని రాజేశాడు. కల్నల్ సోఫియా ఖురేషిని మత ప్రాతిపదికపై బిజెపి మంత్రి విమర్శలు చేశాడని తను పనికిమాలిన వ్యాఖ్యలు చేశాడు. కల్నల్ సోఫియా ఖురేషి తోపాటు మీడియా బ్రీఫింగ్‌లో పాల్గొన్న వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, వైమానిక దాడులను వివరించిన ఎయిర్ మార్షల్ ఎకె భారతి కులాలను ఎంచి అనుచితంగా మాట్లాడాడు. రాజకీయ నాయకులు ఓటు బ్యాంకును స్థిరం చేసుకోవడానికి దేశంలో కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టడం పరిపాటి. దేశ రక్షణకోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడి పనిచేసే సైనికుల మధ్య కులాల అడ్డుగోడలు కట్టడం సరైంది కాదనే ఇంగిత జ్ఞానం కూడా అతనికి లేకపోయింది. రేయింబవళ్లు కంటిమీద కునుకు లేకుండా సరిహద్దులో కాపలాకాస్తున్న సైన్యానికి కులాల, మతాల ముసుగు తొడగడంతో పొరుగు దేశాల ముందు దేశం పరువు మసకబారింది.

మధ్యప్రదేశ్ మంత్రి మాట్లాడిన మాటల మంటలు చల్లారక ముందే ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జగదీష్ దేవ్డా ప్రజలపై, సైన్యంపై విషం చిమ్మాడు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు ప్రజలు, సైన్యం ప్రధాని మోడీ కాళ్లకు మొక్కాలని అవమానించే రీతిలో మాట్లాడాడు. వాస్తవానికి ఇతరులకు గౌరవ మర్యాదలు ఇవ్వడంలో మోడీ ఎప్పుడు ముందుంటారు. ప్రధాని తనను కలవడానికి వచ్చే ప్రతిభావంతుల కాళ్లకు నమస్కారం చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మోడీకి ఇటువంటి నేపథ్యం ఉన్న పరిస్థితులలో దేశ ప్రజలు, సైన్యం ప్రధాని కాళ్లు మొక్కాలని ఉప ముఖ్యమంత్రి చెప్పడంలో ఔచిత్యం ఏమిటో తెలియడం లేదు. సైనికులు తమ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి తెలియజేసినందుకు కాళ్లు మొక్కాల్సి ఉండేనా? సైన్యం ధైర్యసాహసాలతో ఉగ్రవాద స్థావరాలు నేలమట్టం చేసి పాకిస్తాన్‌ను కాళ్ళబేరానికి తీసుకొచ్చినందుకు సాగిలపడాలా? ప్రధానమంత్రి తీసుకునే నిర్ణయానికి ప్రజలు, ప్రతిపక్షాలు మద్దతు ఇచ్చి ఐక్యంగా నిలబడినందుకా? మొదలగు ప్రశ్నలకు కమలనాథుల నుంచి సమాధానం ఆశించడం వృథా ప్రయాసే అవుతుంది. దేశవ్యాప్తంగ ఓ వైపు పాకిస్తాన్ కుతంత్రాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు దౌత్యప్రచారానికి కమిటీలను నియమిస్తున్న కేంద్ర ప్రభుత్వం, మరోవైపు దేశంలోపల సైన్యంపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్న తమ నాయకులను అదుపులో పెట్టలేకపోవడం విస్మయం కలిగిస్తోంది. దేశంలో పహల్గాం ఉగ్రదాడి, అనంతరం జరిగిన ఆపరేషన్ సిందూర్ పరిస్థితులపై బిజెపి నాయకులు మాట్లాడే మాటలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. తాజాగా హర్యానా బిజెపి రాజ్యసభ సభ్యుడు రామచందర్ జంగ్రా ఉగ్రదాడిలో భర్తల ప్రాణాలు కోల్పోయిన మహిళలపై నోరు పారేసుకున్నాడు. భర్తలను కోల్పోయిన మహిళలకు స్ఫూర్తి, వీరోచిత లక్షణాలు లేవని ఉగ్రవాదులను వేడుకునే బదులు తిరగబడాల్సిందని నాలుకకు పని చెప్పాడు. విచక్షణా రహితంగా కాల్పులు జరుపుతున్న ఉగ్రమూకలపై నిస్సహాయులైన మహిళలు ఏ రకంగా పోరాటం చేస్తారో అతని మేధస్సుకే తెలియాలి. గతంలో జాతిపిత మహాత్మా గాంధీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సేను దేశభక్తుడిగా పార్లమెంటు సాక్షిగా బిజెపి ఎంపి ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ కీర్తించింది. రూ. 100 కోసం రైతు చట్టాల వ్యతిరేక నిరసన దీక్షలో మహిళా రైతులు కూర్చున్నారని ఎంపి కంగనా రనౌత్ ఎగతాళి చేసింది.

# చిక్కుల్లో కమల్ హాసన్ బెంగళూరులో కేసు నమోదు

**–కన్నడ భాష తమిళం నుంచే పుట్టిందన్న కమల్ –ఆయన వ్యాఖ్యలపై కన్నడిగుల ఆగ్రహం – బెంగళూరులో ఆయనపై ఫిర్యాదు**

**వేద న్యూస్, డెస్క్:**



'కన్నడ భాష తమిళం నుంచే పుట్టింది' అని ప్రముఖ నటుడు కమల్ హాసన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు కర్ణాటకలో దుమారం రేపుతున్నాయి. తన తాజా చిత్రం 'థగ్ లైఫ్' ఆడియో రిలీజ్ ఈవెంట్‌లో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు కన్నడిగుల ఆగ్రహానికి కారణమయ్యాయి. ఆయన వ్యాఖ్యల నేపథ్యంలో కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ క్రమంలో కమల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కర్ణాటక రక్షణ వేదిక (కేఆర్‌వీ) రంగంలోకి దిగింది. బెంగళూరులోని ఆర్‌టీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేసింది. కమల్ వ్యాఖ్యలు కన్నడిగుల మనోభావాలను దెబ్బతీశాయని, కన్నడిగులు, తమిళుల మధ్య విద్వేషాలను సృష్టించేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొంది. ఆయనపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేఆర్‌వీ డిమాండ్ చేసింది. దీంతో కమల్‌పై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

– సారీ చెప్పిన కమల్

అయితే, తన వ్యాఖ్యలపై కమల్ హాసన్ స్పందిస్తూ ఇప్పటికే సారీ చెప్పారు. తాను ప్రేమతో ఆ వ్యాఖ్యలు చేశానని, ఎవరినీ అగౌరవపరచాలనే ఉద్దేశం తనకు లేదని అన్నారు. భాషల చరిత్ర గురించి మాట్లాడే అర్హత రాజకీయ నాయకులకు లేదని పేర్కొన్నారు. ఈ చర్చను చరిత్రకారులు, భాషా నిపుణులకు వదిలేయాలని అన్నారు. ఇక, కమల్ హాసన్ వ్యాఖ్యల కారణంగా కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో కన్నడిగులు నిరసనలకు దిగారు. కొన్నిచోట్ల ఆయన థగ్ లైఫ్ మూవీ పోస్టర్లను దహనం చేయడంతో పాటు కమల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ వివాదం 'థగ్ లైఫ్' సినిమా రిలీజ్‌పై కూడా ప్రభావం చూపే అవకాశం లేకపోలేదని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. కాగా, ఈ వివాదంపై కర్ణాటక రాజకీయ నేతలు కూడా స్పందించారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ, కమల్‌కు కన్నడ భాష చరిత్రపై సరైన అవగాహన లేదన్నారు. ఇతర భాషలను అవమానించడం సరైంది కాదని పేర్కొన్నారు. కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర కూడా కమల్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పలువురు నేతలు కమల్ హాసన్ సినిమాలను కర్ణాటకలో నిషేధించాలని కోరారు.

## కాల్పుల విరమణపై అమెరికా

# కోర్టులో ట్రంప్ బృందం వాదన

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం విషయమై అమెరికాతో జరిపిన చర్చల్లో సుంకాలను (టారిఫ్‌లు) గురించిన అంశం ఎన్నడూ ప్రస్తావనకు రాలేదని భారత ప్రభుత్వం గురువారం మరోసారి స్పష్టం చేసింది. ఈ నెలలో జరిగిన ఈ చర్చల సందర్భంగా టారిఫ్‌ల గురించి మాట్లాడినట్లు అమెరికా కోర్టులో ట్రంప్ బృందం చేసిన వాదనలను భారత్ తోసిపుచ్చింది. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అనంతరం, పాకిస్థాన్‌తో కాల్పుల విరమణకు సంబంధించి అమెరికాతో భారత ప్రతినిధులు చర్చలు జరిపారని, ఈ చర్చల సమయంలో ఇరు దేశాల మధ్య వాణిజ్యపరమైన సుంకాలను గురించిన అంశం కూడా చర్చకు వచ్చిందని ట్రంప్ బృందం అమెరికా కోర్టులో వాదనలు వినిపించింది. టారిఫ్ కారణంగానే కాల్పుల విరమణ ఒప్పందం సాధ్యమైందని ట్రంప్ ప్రభుత్వం వాదించింది. ఈ ఆరోపణలపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. "పాకిస్థాన్‌తో కాల్పుల విరమణకు సంబంధించి అమెరికాతో జరిగిన చర్చలు పూర్తిగా ఆ అంశానికే పరిమితమయ్యాయి. ఈ చర్చల్లో సుంకాలను గురించి ఎలాంటి ప్రస్తావన రాలేదు. ఇది పూర్తిగా అవాస్తవం" అని విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి. తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, గతంలో చెప్పినట్లుగానే సుంకాలను గురించిన అంశం ఈ చర్చల్లో భాగం కాదని పునరుద్ఘాటించాయి. భారత్–అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలు, సుంకాలను విధించే అంశాలు వేరే వేదికలపై చర్చిస్తామని, వాటికి, పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ చర్చలకు ఎలాంటి సంబంధం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ట్రంప్ బృందం చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, కేవలం తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే ప్రయత్నమేనని భారత అధికారులు పేర్కొన్నారు.

## వల్లభనేని వంశీకి కోర్టులో

# ఊరటతో పాటు ఎదురుదెబ్బ

**వేద న్యూస్, నూజివీడు :**



వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో ఈరోజు నూజివీడు కోర్టులో మిశ్రమ అనుభవాలు ఎదురయ్యాయి. వంశీని రెండోసారి పోలీసు కస్టడీకి ఇవ్వాలంటూ హనుమాన్ జంక్షన్ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. గతంలో ఇదే కేసులో రెండు రోజుల పాటు వంశీని విచారించినందున, మళ్లీ కస్టడీ అవసరం లేదని కోర్టు పేర్కొంది. ఆ సమయంలో వంశీ అస్వస్థతకు గురవడంతో విచారణ సరిగా జరగలేదని పోలీసులు వాదించినప్పటికీ, కోర్టు అంగీకరించలేదు.

**– రిమాండ్ పొడిగింపు**

అయితే, ఇదే కేసులో వంశీకి విధించిన రిమాండ్ నేటితో ముగియడంతో, పోలీసులు ఆయనను వర్చువల్‌గా న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం వంశీకి జూన్ 12 వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు, అనారోగ్య కారణాలతో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ వంశీ నూజివీడు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా పోలీసులను ఆదేశిస్తూ, తదుపరి విచారణను జూన్ 2వ తేదీకి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, అక్రమ మైనింగ్ కేసుకు సంబంధించి వంశీ ముఖ్య అనుచరుడిగా భావిస్తున్న ఓలుపల్లి మోహన్ రంగాను రెండు రోజుల పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో పోలీసులు రంగాను విజయవాడ జిల్లా జైలు నుంచి గన్నవరం ఆసుపత్రికి తరలించి, వైద్య పరీక్షల అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు.

# ప్రపంచంలోనే అతి పొడవైన పైర్ వంతెన పూర్తి

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



దేశవ్యాప్తంగా కనెక్టివిటీ మెరుగుపర్చడంలో భారత రైల్వే శాఖ కొత్త రూట్లలో కొన్ని రైళ్లను ప్రారంభించింది. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలలో రైలు పట్టాలు, రైళ్లను మెరుగుపరచడంలో భారతీయ రైల్వేలు నిమగ్నమై ఉన్నాయి. మణిపూర్‌లో ముఖ్యమైనదిగా పరిగణించే నోనీ బ్రిడ్జి పునరుద్ధరణ పనులు తుది దశకు చేరుకున్నాయి. నంబర్ 164పై గిర్డర్‌లను ఏర్పాటు చేసే పనిని పూర్తి చేయడం ద్వారా ఈశాన్య సరిహద్దు రైల్వే పెద్ద విజయాన్ని సాధించింది. భారతదేశంలో ఇంజనీరింగ్ ప్రపంచంలో ఇది అతి పెద్ద విజయంగా భావిస్తోంది. నోని బ్రిడ్జి, ఒక ఇంజనీరింగ్ అద్భుతం. 141 మీటర్ల పొడవుతో ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే పియర్ వంతెన. ఇది 111 కి.మీ పొడవైన జిరిబామ్–ఇంఫాల్ క్యాపిటల్ కనెక్టివిటీ ప్రాజెక్ట్‌లో అంతర్భాగం. ఈశాన్య సరిహద్దు రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ కపింజల్ కిషోర్ శర్మ విడుదల చేసిన ఒక ప్రకటనలో, ఇటీవల వంతెన చివరి స్పాన్‌ను విజయవంతంగా నిర్మించామని, తద్వారా ఈ ప్రత్యేకమైన ప్రాజెక్ట్‌లోని 8 స్పాన్‌లను ఏర్పాటు చేసే పని పూర్తయిందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వంతెన వీడియోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి సమాచారం ఇచ్చారు.

# మయన్మార్‌లో చిక్కుకున్న భారతీయులకు చిత్రహింసలు!

**వేద న్యూస్, డెస్క్:**

మంచి జీతం, మెరుగైన భవిష్యత్తు ఆశతో విదేశాలకు వెళ్లాలనుకునే భారతీయ యువకులే లక్ష్యంగా సాగుతున్న అంతర్జాతీయ మోసాలకు అద్దం పట్టే దారుణ ఉదంతమిది. మయన్మార్‌లోని కొన్ని నకిలీ ఐటీ కంపెనీలు, ఉద్యోగాల పేరిట భారతీయులను అక్రమంగా తరలించి, వారిచేత బలవంతంగా ఇంటర్నెట్ మోసాలకు పాల్పడేలా చేస్తున్నాయి. మాట వినని వారిని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోలేని వారిని అమానుష చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. వారం రోజుల పాటు ఫ్రిజ్‌లో ఉంచిన, కుళ్లిపోయిన బాతు గుడ్లను బలవంతంగా తినిపించడం, నిరాకరించిన వారికి కరెంట్ షాకులు ఇవ్వడం వంటి పైశాచిక చర్యలకు పాల్పడుతున్నట్లు బాధితులు వాపోయారు. ఇటీవల మార్చి నెలలో, భారత ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని, మోసపూరిత ఏజెంట్ల బారిన పడి మయన్మార్‌లో చిక్కుకున్న 540 మంది భారతీయ పౌరులను సురక్షితంగా స్వదేశానికి తరలించింది. బాధితుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, బీహార్, రాజస్థాన్, కేరళ, తమిళనాడు వంటి పలు రాష్ట్రాలకు చెందినవారున్నారు. వీరిలో 65 మంది, తాము పనిచేస్తున్న ఓ కంపెనీలో నిరంతర వేధింపులు తాళలేక సమ్మెకు దిగారు. మార్చి 11, 12 తేదీల్లో ఢిల్లీకి చేరుకున్న అనంతరం వారు సీబీఐ అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మయన్మార్‌లోని మయావడి ప్రాంతంలో తమను ఎలా నియమించుకున్నారు, అక్కడికి ఎలా తరలించారు, ఎలాంటి చిత్రహింసలకు గురిచేశారో వివరించారు. బాధితుల్లో ఒకరైన కరీంనగర్ జిల్లా, మానకొండూరు మండలం, రంగంపేటకు చెందిన కొక్కిరాల మధుకర్ రెడ్డి (31) తన అనుభవాలను ఓ జాతీయ మీడియాతో పంచుకున్నారు. 2024 డిసెంబర్ 18న బ్యాంకాక్ వెళ్లిన తనను, అక్కడి నుంచి మంచి ఐటీ ఉద్యోగం పేరుతో మయావడికి అక్రమంగా తరలించారని తెలిపారు. "శిక్షణ సమయంలోనే మా చేత అమెరికాలోని ప్రవాస భారతీయులను (ఎన్నారై) మోసం చేయించి, ఉనికిలో లేని కంపెనీలలో పెట్టుబడులు పెట్టించాలని చూస్తున్నారని అర్థమైంది" అని మధుకర్ రెడ్డి పేర్కొన్నారు. "నేను ఉద్దేశపూర్వకంగానే టార్గెట్లు పూర్తి చేయకపోవడంతో నన్ను చాలాసార్లు శిక్షించారు. ఆ భయంకరమైన కుళ్లిన బాతు గుడ్లను చాలాసార్లు తినాల్సి వచ్చింది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కంపెనీలు కట్టుదిట్టమైన భద్రత నడుమ, సొంత 'ప్రైవేటు సైన్యం'తో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని మధుకర్ తెలిపారు. "ఆ గుడ్లను వారం రోజుల పాటు ఫ్రిజ్‌లో ఉంచి, కుళ్లిపోయిన తర్వాత బలవంతంగా మా గొంతులో కుక్కేవారు. దాని దుర్వాసన, రుచి చాలా దారుణంగా ఉండేది. కడుపులో తిప్పేసి, రోజుల తరబడి ఏమీ తినలేకపోయేవాళ్లం" అని ఆయన గుర్తుచేసుకున్నారు. "ఎవరైనా ఆ గుడ్లు తినడానికి నిరాకరిస్తే, వారికి కరెంట్ షాకులు ఇచ్చేవారు" అని మధుకర్ చెప్పారు. వీటితో పాటు, రెండు చేతుల్లో 20 లీటర్ల ఖాళీ నీళ్ల క్యాన్లను అర గంట సేపు పట్టుకోమనడం, 5 కిలోమీటర్లు పరిగెత్తించడం, గంటల తరబడి మండుటెండలో నిలబెట్టడం వంటి శిక్షలు కూడా ఉండేవని వివరించారు. మహిళలను కూడా వదల్లేదని, హర్యానాకు చెందిన ఓ మహిళను మరింత కఠినంగా శిక్షించారని ఆయన తెలిపారు. ఈ క్రూరత్వం హద్దులు మీరడంతో 65 మంది భారతీయ ఉద్యోగులు మయావడి టౌన్‌షిప్‌లోని కేకే2 భవనం వెలుపల రాత్రంతా నిరసన తెలిపారు. ఈ ప్రదర్శన స్థానిక మయన్మార్ పోలీసుల దృష్టికి వెళ్లడంతో, వారు భారత రాయబార కార్యాలయానికి సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన అధికారులు, బాధితులను సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇలాంటి నకిలీ విదేశీ ఉద్యోగ ఆఫర్ల పట్ల ఇతరులు అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశంతోనే తాను ఈ విషయాలు పంచుకుంటున్నానని మధుకర్ రెడ్డి తెలిపారు. "మాకు జరిగినట్లు ఎవరికైనా జరగవచ్చు. ప్రజలు ఇలాంటి ఆఫర్లను గుడ్డిగా నమ్మకుండా, క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అంగీకరించాలి" అని ఆయన హెచ్చరించారు.

వేద న్యూస్

శుక్రవారం మే 30, 2025



## కోర్టు ఆవరణలో న్యాయవాదుల నిరసన

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

నల్గొండ జిల్లా,మిర్యాలగూడ కోర్టు ఆవరణ ముందు న్యాయవాదులు నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈనెల27 న తుంగతుర్తి కోర్ట్ లో ప్రాక్టీస్ చేస్తున్న బానోతు ప్రతాప్‌పై దాయాదులు భూమి వివాదంలో దాడిని తీవ్రంగా గాయ పరచడం జరిగింది. సదరు అడ్వకేట్ ప్రతాప్ కోర్ట్‌లో ఇంజక్షన్ ఆర్డర్ తీసుకున్న కూడా దాడి చేయడం జరిగిందని,ఆ దాడికి నిరసననగా నల్ల బ్యాడ్జ్ లు ధరించి మిర్యాలగూడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు స్థానిక కోర్టు ముందు ధర్నా చేసి నిరసన తెలియచేశారు. ఈ కార్యక్రమం లో మిర్యాలగూడ బార్ ప్రెసిడెంట్ నేతి సత్యనారాయణ,సెక్రటరీ భూపతి రెడ్డి, సుండి శ్రీనివాస్, కొంకా వెంకన్న ,సాయి,ఇబ్రహీం,మేక కుమార్ రెడ్డి,పద్మయ్య,పుల్లా రెడ్డి,పీఎస్ ప్రసాద్,స్వరాజ్యం,సుస్మిత, సైదులు,రామచంద్రుడు,కిరణ్ లతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య..!

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలంలోని కొత్తగూడెం వద్ద రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. ఆత్మహత్య చేసుకున్న యువకుడు తిప్పర్తి మండలం షిలార్మియగూడెం గ్రామానికి చెందిన రాయి మహేందర్ (22)గా స్థానికులు గుర్తించడం జరిగింది. యువకుడి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.




## యోగాతోనే శారీరక, మానసిక ఆరోగ్యం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

ప్రతి ఒక్కరికి మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం పెంపొందించడానికి యోగ తోడ్పడుతుందని ఆమనగల్లు హోమియోపతి వైద్యురాలు డాక్టర్ భవాని అన్నారు. వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామంలో గ్రామపంచాయతీ ముందు 11వ అంతర్జాతీయ యోగా డే వార్షికోత్సవాలు హోమియోపతి వైద్యురాలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలతో కలిసి యోగ ఆసనాలు చేయించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యోగ ఫర్ వన్ హెల్త్....వన్ హెల్త్ ప్రజలతో నినాదాలు చేయించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రతిరోజు రెండు గంటలపాటు యోగా చేస్తే ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో చిన్నపిల్లలకు, వయోవృద్ధులకు యోగ నేర్పించడం జరిగిందన్నారు. యోగా మాస్టర్లు పరమేష్,శ్రావణి ఏఎన్ఎం జ్యోతి,గురుస్వామి,హెల్త్ అసిస్టెంట్ నరసయ్య, ఆశవర్కర్లు వెంకటమ్మ,అన్నపూర్ణ, సుందరమ్మలు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి

**వేద న్యూస్, శేరిలింగంపల్లి:**



నిర్మాణంలో ఉన్న ఓ భవనం పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి కార్మికుడు మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మియాపూర్ లోని మదీనగూడలో నిర్మాణంలో ఉన్న భవనంలో కార్మికుడిగా పనిచేస్తున్న చత్తీస్గఢ్ కు చెందిన బికెన్ (21) ప్రమాదవశాత్తు భవనం పైనుండి మూడవ అంతస్తు నుంచి కింద పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి బికెన్ తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జరిగిన సంఘటన తెలుసుకున్న పోలీసులు స్థలానికి చేరుకొని పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కు తరలించారు. అనంతరం భవన యజమాని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సరైన జాగ్రత్త చర్యలు తీసుకోనందునే మియాపూర్లోని మదినాగూడలో కొనసాగుతున్న నిర్మాణం పట్ల యాజమాన్యం సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని కార్మిక సంఘం ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

### చర్యలు తీడుకుంటాం:చందానగర్ డీసీ మోహన్ రెడ్డి

మియాపూర్ మదినాగుడలో అక్రమంగా కొనసాగుతున్న నిర్మాణంపై చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే సదరు నిర్మాణంపై స్పీకింగ్ ఆర్డర్స్ ఉన్నాయి. మరోసారి పరిశీలించి, అనుమతులు రద్దు చేసి, భవనాన్ని సీజ్ చేస్తామని, చందానగర్ డీసీ మోహన్ రెడ్డి తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

**మొదటి పేజీ తరువాయి**

చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఇప్పటికే చాలా ఆలస్యం అయినందున ఇక ఎంత మాత్రం వాయిదా వేయకుండా బీసీ రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు

### సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి : వెంకట్రాములు

గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన సర్పంచులు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా గత ప్రభుత్వం వారిని ఇబ్బందుల పాలు చేసిందన్నారు. బిల్లులు రాక అప్పుల పాలై ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని వారిబాధలువర్ణణాతీత మన్నారు.సుమారు రూ.2000 కోట్లకు పైగా ఉన్న పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పెట్రోల్ బంకులే అతని టార్గెట్..

- **డెబిట్ కార్డులతో హైటెక్ మోసం : డీఎస్పీ రాజశేఖర్ రాజు**

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి:**

నాగార్జునసాగర్ నియోజకవర్గలోని హైవేపై గల పెట్రోల్ బంకులే లక్ష్యంగా డెబిట్ కార్డులతో స్వైప్ చేసుకొని మోసపూరితంగా డబ్బులను తిరిగి రిటన్ పంపించుకుంటున్న మోసగాడిని పోలీసులు అరెస్టు చేశారు. మిర్యాలగూడ లోని డిఎస్పి కార్యాలయంలో ఏర్పాటుచేసిన పత్రిక సమావేశంలో డిఎస్పి రాజశేఖర్ రాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం రావిపాడు గ్రామనికి చెందిన ఆనాల శివ నాగార్జునసాగర్ లోని హైవేపై రద్దీగా ఉండే పెట్రోల్ బంకులను చూసుకొని పంపు బాయ్స్ తక్కువగా ఉండి లేదా బంకులు వాహనాలు ఎక్కువగా ఉన్న సమయంలో తన దగ్గర ఉన్న డెబిడ్ కార్డును స్వైప్ చేసి అమౌంటు ఇవ్వాలని కోరుతూ మీకు కొంత పర్సంటే ఇస్తానని చెప్పి తనకు కావాల్సిన అమౌంట్ తీసుకుంటాడని,పంపు బాయ్ తిరిగి బిజీగా ఉన్న సమయం చూసి స్వైప్ మిషన్ ను తీసుకొని వాయిడ్ సేల్ అనే ఆప్షన్ లోకి వెళ్ళగానే స్వైప్ చేసిన అమౌంట్ ను తిరిగి తన ఎకౌంట్లోకి ట్రాన్జక్షన్ చేస్తూ పలు బంకులను



మోసం చేస్తూ ఉన్నాడని,బంకు యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది.ఇలా ఈనెల 11,16 తేదీలలో పలుమార్లు డెబిట్ కార్డు ద్వారా స్వైప్ చేసి డబ్బులు తిరిగి అతని అకౌంట్ కే వెళ్లినట్లుగా గమనించిన పెట్రోల్ బంక్ యజమాని కొమ్మిరెడ్డి బ్రహ్మారెడ్డి ఫిర్యాదు మేరకు విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగింది.నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు డిఎస్పీ రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో నాగార్జునసాగర్ సిఐ డి.శ్రీను నాయక్ ఆధ్వర్యంలో విజయపురి టౌన్ ఎస్ఐ సంపత్ తన సిబ్బందితో కలిసి నాగార్జునసాగర్ బార్డర్ చెక్పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా 29 వ తేది గురువారం సదరు నేరస్తుడు పోలీసులను చూసి బైక్ పై పారిపోతుండగా పెట్రోలింగ్ పోలీసులు వెంబడించి నేరస్థుడిని పట్టుకోవడం జరిగిందినీ సదరు నేరస్తుడు శివ పై విజయపురి,సూర్యాపేట రూరల్,మునగాల రూరల్, సూర్యాపేట,జగ్గయ్యపేట, మేడికొండూరు,గుంటూరు జిల్లా, కొండూరు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ స్టేషన్లో కేసులు నమోదయి ఉన్నాయని,పై స్టేషన్లతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బాపట్ల గుంటూరు, విజయవాడ,గుడివాడ, నాగులపాడు, ఒంగోలు, వినుకొండ, ఎడ్లపాడు, చోడవరం, దర్శి, విడుగురాళ్ల,తెనాలి,కందుకూర,పొదిలి,గిద్దలూరు ఏరియాలలో కూడా ఇదే తరహా నేరాలు చేశాడని సంబంధిత అధికారులకు కూడా సమాచారం ఇవ్వడం జరిగిందని పత్రిక ముఖంగా వెల్లడించడం జరిగింది. నేరస్తుడి నుంచి 2 లక్షల రూపాయల నగదు,ఒక మోటార్ సైకిల్,ఆరు ఎటిఎం కార్డులు,మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.నేరస్తుడిని చాకచక్యంగా పట్టుకున్నందుకుగాను నాగార్జునసాగర్ సిఐ శ్రీను నాయక్,విజయపురి టౌన్ ఎస్ఐ సంపత్ లతోపాటు కానిస్టేబుల్ లు రామకోటి,జావేద్,సురేష్,సతీష్ వెంకన్న మరియు హోంగార్డులు సతీష్, విజయ్ లను ఎస్పీ శరత్ చంద్ర పవర్ అభినందించారని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు వెల్లడించారు.

# ఘనంగా అహల్యాబాయి హెూల్కర్ జయంతి

**వేద న్యూస్, శాయంపేట:**

మహిళల సాధికార కోసం శాయంపేట మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో అహల్యాబాయి హెూల్కర్ 300వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు.ఆమె చరిత్రను ప్రతి ఒక్కరికి తెలియాలి అని ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జయశంకర్ జిల్లా భూపాలపల్లి బిజెపి అధ్యక్షులు ఎడునుతుల నిశిధర్ రెడ్డి హాజరయ్యారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహల్యాబాయి హెూల్కర్ భారతదేశ చరిత్రలో అత్యంత గౌరవనీయురాలైన మహిళా పాలకురాలు 1725 మే 31న మహారాష్ట్రలోని చోండీ గ్రామంలో జన్మించిన ఆమె, 1795 ఆగస్టు 13న మరణించారు. మరాఠా సామ్రాజ్యంలోని ఇండోర్ ప్రాంతాన్ని పాలించిన ఆమె, భారతదేశంలో అనేక ఆలయాల పునర్నిర్మాణం, సామాజిక సేవా కార్యక్రమాలు, మహిళా సాధికారత కోసం చేసిన కృషి ద్వారా ప్రసిద్ధి చెందారు. ఆమె పాలనలో, ప్రజల సంక్షేమం, న్యాయం,సమాజ సేవకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రతిరోజూ ప్రజల సమస్యలను వినడానికి ఆమె ప్రజా సమావేశాలను నిర్వహించేవారు.



అహిల్య బాయి మహిళల విద్య, స్వయం సహాయ సమూహాలు, మహిళల సాధికారత కోసం అనేక కార్యక్రమాలను ప్రారంభించారు. మహిళల కోసం ప్రత్యేకంగా విద్యా సంస్థలు, ఆశ్రమాలు, శ్రామిక క్షేత్రాలు ఏర్పాటు చేశారు అని కొనియాడారు.అహిల్యాబాయి హెూల్కర్ భారతదేశంలోని అనేక పవిత్ర స్థలాలలో ఆలయాలను పునర్నిర్మాణం చేశారు. వారణాసిలోని కాశీ విశ్వనాథ్ ఆలయం, గయా, సోమనాథ్, కంచి, రామేశ్వరం, పూరీ, హరిద్వార్ వంటి ప్రాంతాల్లో ఆలయాలు, ఘాట్‌లు, ధర్మశాలలను నిర్మించిన ఘనత ఆమెదే అని తెలిపారు.

అహిల్యాబాయి హెూల్కర్ మహిళల సాధికారత కోసం అనేక కార్యక్రమాలను ప్రారంభించారు. మహే శ్వర్‌లో మహిళల చేతి పనుల ద్వారా మహేశ్వరి సారీల తయారీ పరిశ్రమను స్థాపించారు. ఈ పరిశ్రమ ద్వారా అనేక మహిళలకు ఉపాధి కల్పించారు. అహిల్యాబాయి హెూల్కర్ యొక్క వారసత్వం భారతదేశంలో ఇప్పటికీ గుర్తించబడుతుంది. ఇండోర్‌లోని విమానాశ్రయం దేవి అహిల్యాబాయి విమానాశ్రయం, విశ్వవిద్యాలయం దేవి అహిల్యా విశ్వవిద్యాలయంగా పునర్నామకరణంచేయ బడింది. మహారాష్ట్ర ప్రభుత్వం అహ్మద్‌నగర్ పట్టణాన్ని "అహిల్యానగర్"గా పునర్నామకరణం చేసింది అన్నారు. అహిల్యాబాయి హెూల్కర్ యొక్క జీవితం, ఆమె ధైర్యం, న్యాయం, సామాజిక సేవకు చేసిన కృషి భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కానుగుల నాగరాజు, ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పు రాజు, సీనియర్ నాయకులు గంగుల రమణారెడ్డి, వనం దేవరాజు, మామిడి విజయ్, లడే శివ , కుక్కల మహేష్, బూత్ అధ్యక్షులు కడారి చంద్రమౌళి, బాసాని నవీన్, కోమటి రాజశేఖర్, పున్నం సాంబయ్య పాల్గొన్నారు.

## కఠిన చర్యలు చేపట్టాలి

**మొదటి పేజీ తరువాయి**

నకిలీ విత్తనాలు ఎరువులు అమ్మినట్లయితే పీడీ యాక్ట్ ను నమోదు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిలో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అన్నారు. రాష్ట్రంలో అంచనాలకు మించి 160 శాతం ధాన్యం అధికంగా వచ్చిందన్నారు. దేశ వ్యాప్తంగా ధాన్యం సేకరణలో (ఖరీఫ్, రబీ రెండు సీజన్లో) తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానం లో ఉందన్నారు. ధాన్యం అంశానికి సంబంధించిన తలెత్తుతున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. ముందస్తుగానే వర్షాలు పడుతుండడంతో ధాన్యం తడిసిందన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విషయంలో కలెక్టర్లు, ఎస్పీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 85శాతం ధాన్యము కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రజా ప్రతినిధులు, అధికారులకు మంత్రి అభినందనలు తెలియజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరగాలన్నారు. నిర్ణీత గడువుని నిర్ణయించి దాని ప్రకారం ఇల్లు నిర్మాణం పూర్తి కావాలన్నారు. జూన్ 6వ తేదీ నాటికి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్లు ఇందిరమ్మ ఇండ్లకు ఇసుకను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందజేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పాలన ఆఫీసర్స్ టెస్ట్ పూర్తయిందని, పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి జూన్ 2వ తేదీన గ్రామ పాలన అధికారులను నియమించబోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడుకోవాలన్నారు. రైతులు, భూములు ఉన్న వారిని ఇబ్బందులు పెట్టొద్దన్నారు. రైతులను ఇబ్బందులను పెడితే చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి ప్రజలే ముఖ్యమని పేర్కొన్నారు. జూన్ మూడవ తేదీ నుండి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించాలని, స్వీకరించిన దరఖాస్తులను ఆగస్టు 15వ తేదీ నాటికి పరిష్కరించాలన్నారు. జూన్ 2వ తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఉదయం జిల్లా కేంద్రంలో కార్యక్రమం నిర్వహించాలని, అదే రోజు మధ్యాహ్నం నియోజకవర్గ ంంద్రాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్ర మాలను తెలియజేయాలన్నారు. అనంతరం రాష్ట్ర పర్యావ రణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు ఎరువులు నియంత్రణకు ఏర్పాటుచేసిన కమిటీలో అధికారులతో పాటు రైతులను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. బ్లాక్ మార్కెట్ కు విత్తనాలు ఎరువులు తరలకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ కమిటీ క్రియాశీలకంగా పనిచేస్తూ నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి,స్టేషన్గన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి,పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస జనగామ, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు రిజ్వాన్ భాషా షేక్, టీఎస్ దివాకర, అద్వైత్ కుమార్ సింగ్, రాహుల్ శర్మ, ఎస్పీలు, ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 118 వాహనాలు.. 220 లీటర్ల మద్యం సీజ్..!

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ టుటౌన్ పరిధిలోని ప్రకాశ్ నగర్ కాలనీలో గురువారం తెల్లవారుజామున జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు డీఎస్పీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 20 మంది ఎస్ఐలు మొత్తం 280 మంది పోలీస్ సిబ్బంది, ఒక నార్కోటిక్ డాగ్ తో సోదాలు చేశారు. సరియైన పత్రాలు లేని 98 ద్విచక్ర వాహనాలు, 16 ఆటోలు, 3 కార్లు, 1 ఇసుక ట్రాక్టర్, 220 లీటర్ల మద్యం సీజ్ చేశారు. ముగ్గురు రౌడీ షీటర్స్,ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అసాంఘిక కార్యకలాపాల కట్టడి కొరకు పట్టణంలో కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.కాలనీల్లో, ఇంటి ప్రదేశాల్లో అనుమానితంగా ఎవరైనా కనబడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని కోరారు. కొత్తగా ఇండ్లకు కిరాయిలకు వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకున్నాకే ఆద్దెలకు ఇవ్వాలని సూచించారు.నేర రహిత పట్టణంగా తీర్చి దిద్దడంతో పాటు ప్రజలకు రక్షణ కల్పించుటకు జిల్లా పోలీసు యంత్రాంగం పని చేస్తుందన్నారు. కాలనీలో ఏలాంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలని అన్నారు. ముఖ్యంగా నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు ఎంతో ముఖ్యం అని వాటిని ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జిల్లాలో గంజాయి తదితర మాదకద్రవ్యాలను నిలువరించడం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు.గంజాయి సేవించిన కొంత మంది అనుమానితులకి టెస్టులు నిర్వహించడం జరిగిందని వీరిలో ఒక్కరికి కూడా పాజిటివ్ రాకపోవడం సంతోషకరమైన విషయం అని అన్నారు. ఎక్కడైన గంజాయి సేవిస్తున్నట్లు, విక్రయించినట్లు, కానీ రవాణా చేస్తున్నట్లు కానీ తెలిస్తే డయల్ 100 లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐలు సోమ నర్సయ్య, పి.యం.డి ప్రసాద్, మోతిరం,జనార్ధన్ గౌడ్,శ్రీను నాయక్, కరుణాకర్,ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ట్రబుల్, అల్సర్‌పై 'ఊడుగుల' బుక్

**వేద న్యూస్, జమ్మికుంట:**



ప్రపంచవ్యాప్తంగా జెర్డ్ (జీఈ ఆర్డీ-గ్యాస్ట్రో ఎసోఫాగి యల్ రిఫ్లక్స్ ) వ్యాధితో 1.03 బిలియన్ మంది బాధపడు తున్నారు. మన దేశంలో(భారత్) ప్రతి 100 మందిలో 16 మందికి జెర్డ్ వ్యాధి ఉన్నదని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. భారతీయులకు 7.6 గణనీయమైన (జీఈఆర్డీ) లక్షణాలు ఉండటం గమనార్హం. ఈ వ్యాధి ప్రతి వయసులో సంభవిస్తుంది. కాగా, ఈ డిసీజ్‌పై ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం భారత మల్టీ నేషనల్ ఫార్మా కంపెనీ(మ్యాన్ కైండ్) ముందుకు రాగా, సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ ఊడుగుల సురేశ్ (ఎంబీఎస్ ఎండీ-జనరల్ మెడిసిన్) డిసీజ్ గురించి వివరించారు. డిసీజ్‌కు సంబంధించిన అంశాలన్నీ బుక్‌లో సవివరంగా పొందుపరిచారు. భవిష్యత్తులో ఆయన వివిధ అంశాలపై మరింత అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

## పశువులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

**మొదటి పేజీ తరువాయి**

చట్టవిరుద్ధంగా పశువులను అక్రమ రవాణా చేయడానికి ప్రయత్నిస్తే వారి పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.పశువుల క్రయ విక్రయాలు జరిపే రైతులు, వ్యాపారులు సంబంధిత గ్రామ పంచాయతీ,మునిసిపల్ అధికారులచే ధృవీకరించబడిన రశీదులను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073